క్లుప్తంగా

జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ



క్రీడాకారిణి ఎస్.సానియాను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం విశ్వనారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.సానియా జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ కె.మల్లికార్జున తెలిపారు. వారు మాట్లాడుతూ చెన్నైలోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన జాతీయ క్రీడా పోటీల్లో షాట్‌పుట్‌లో సానియా రెండవ బహుమతి సాధించినట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రం రూ.25 వేలు నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు. అలాగే డాజ్ బాల్ పోటీల్లో రెండవ స్థానం సాధించి రూ.7 వేలు, ప్రశంసా పత్రం, కబడ్డీ పోటీల్లో పాల్గొని జట్టు మూడో స్థానంలో నిలవడంతో రూ.17 వేలు నగదు, ప్రశంసాపత్రం అందుకున్నట్లు చెప్పారు. ఆల్ రౌండ్ చాంపియన్‌గా నిలిచిన క్రీడాకారిణి సానియాను గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

ఆయుష్మాన్ భారత్ పేదలకు వరం

ఆదోనిరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్య బీమా పేదల పాలిట వరంగా మారిందని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లోకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం 4వ రోజుగా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం ఎంపీడీఓ గీతావాణి, సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన మండలంలోని మండిగిరి, నెట్టేకల్ గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. దేశంలో ప్రతిఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం రూ.5లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీని ద్వారా దేశంలోని ఏ ఆస్పత్రిలోనైనా వైద్యం పొందవచ్చని తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఆదోనిఅర్బన్: ఆదోని ఏరియా ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజా ఆత్మగౌరవ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భీమారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆదోని ఏరియా ఆస్పత్రిలో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. రక్త పరీక్ష రిపోర్టును కూడా ఓపీ పేపర్‌పైనే రాసివ్వడం జరుగుతుందన్నారు. నాణ్యత లేని మందులను అందిస్తున్నారని, స్కానింగ్ బయట చేయించుకోవాలని వైద్యులు చెబుతున్నారన్నారు. అన్ని రకాల సేవలను ఆస్పత్రిలోనే రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ప్రజా ఆత్మగౌరవ వేదిక రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, పట్టణాధ్యక్షులు ఉదయ్, పట్టణ కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

తేలుకాటుతో విద్యార్థినికి అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థిని శృతి

ఆదోనిఅర్బన్: మండలంలోని మదిరె గ్రామానికి చెందిన శృతి అనే విద్యార్థినికి శుక్రవారం తేలు కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యింది.మదిరె గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల ఆవరణలో కూర్చొని ఉండగా తేలు కాటు వేసింది. విద్యార్థిని అస్వస్థతకు గురి కావడంతో ఉపాధ్యాయులు వెంటనే విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. విద్యార్థినిని తల్లిదండ్రులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేయాలి

ఆదోనిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్–2023ను రద్దు చేయాలని ఆదోని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనితబాయి కోరారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంలో చాలా లొసుగులు ఉన్నాయని, దీనివల్ల ప్రజలు, రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఈ చట్టంపై అవగాహన కల్పించేందుకు భూ న్యాయనిపుణులు సునీల్‌కుమార్ ఈనెల 12వ తేదీన ఆదోనికి రాబోతున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని న్యాయవాదులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి అంజినప్ప, నాయకులు సవితరాణి, సునీతరెడ్డి, అబ్దుల్‌అన్సారీ, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుంద క్షేత్రం.. ప్రగతి మంత్రం

- నాలుగేళ్లలో మారిన ఆలయ రూపురేఖలు
- రూ.18.18 కోట్లతో అభివృద్ధి పనులు



ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం ఏరియల్ వ్యూ



తుదిమెరుగులు దిద్దుకుంటున్న తూర్పు రాజగోపురం





చివరి దశకు చేరిన బండపరుపు పనులు, బంగారు పూతతో తయారు చేయించిన కలశాలు

మంత్రాలయం: ప్రభుత్వ సహకారం.. భక్తుల దాతృత్వం.. అభివృద్ధి మంత్రంగా శోభిల్లింది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా అధికారుల విజన్ తోడు కావడంతో క్షేత్రం సర్వ హంగులకు తోవ ఏర్పడింది. నాలుగేళ్లలో బృహత్తర పనులతో ఆలయం సరికొత్త వైభవాన్ని సంతరించుకుంది. శ్రీశైలం తరహాలో ఉరకుంద ఈరన్న క్షేత్రం సొరభాన్ని సొంతం చేసుకుంది. ఆలయ హంగులపై భక్తకోటి సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తోంది.

కర్నూలు జిల్లాలో పెద్ద పుణ్యక్షేత్రాల్లో ఉరుకుంద ఈరన్న ఆలయం ఒకటి. జిల్లా పశ్చిమాన భక్తుల ఇలవేల్పుగా ఈరన్న స్వామి వర్ధిల్లుతున్నారు. పవర్ ఫుల్ గాడ్‌గా పేరుగాంచిన స్వామికి తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల్లో కోట్లాది భక్తులు ఉన్నారు. శ్రావణ మాసోత్సవాలు వచ్చాయంటే క్షేత్రంలో ప్రతిరోజూ సందడే ఉంటుంది. ఏటా 4 కోట్ల వరకు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు.

రూ.కోట్లతో పనులు.. కొత్త వెలుగులు

ప్రభుత్వ సహకారంతో నాలుగేళ్లలో రూ.18.18 కోట్లతో క్షేత్రంలో ప్రధాన అభివృద్ధి పనులు చేపట్టారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ రూపులను మార్చేశారు. రూ.9.70 కోట్ల అంచనాతో నాలుగు రాజగోపురాలు, రూ.4.60 కోట్లతో మహాప్రాకారం నిర్మాణం గావించారు. రాజగోపురాలను ఒక అంతస్తు శిలా, మిగతా అంతస్తులను ఇసుకతో నిర్మాణం కానిచ్చారు. ఇక ఆలయం చుట్టూ రాజగోపురాలను అనుసంధానం చేస్తూ 15 అడుగులకు పైగా శిలతో మహాప్రాకారం కట్టారు. మహా ప్రాకారం నిర్మాణంతో ఆలయ భద్రత మెరుగుపడింది. ఇక మహా ప్రాకారంలోనూ రూ.1.26 కోట్లతో బండపరుపు పరుస్తున్నారు. భక్తుల తాకిడి దృష్ట్యా ఇక్కడ కొత్తగా రూ.50 లక్షలతో దర్శన క్యూలైన్లు, రూ.49 లక్షలతో క్యూలైన్ల షెడ్లను ఏర్పాటు చేశారు.

వెల్లువలా విరాళాలు

ప్రగతి పనులను చూసి దాతలు సైతం వేలాదిగా సాయం చేయడానికి ముందుకు వస్తున్నారు. క్షేత్రం పనుల్లో తమ వంతుగా సహకారం అందిస్తున్నారు. రాజగోపురాల నిర్మాణానికి రూ.4,35,47,423 మొత్తం విరాళాల రూపంలో సమకూరింది. దాతల ఔదార్యంతో రాజగోపురాలపై రూ.84 లక్షలతో బంగారు పూతతో 24 కలశాలను రూపొందించారు. రూ.43.96 లక్షలతో రాజగోపురాల ద్వారా మందిరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రూ.20 లక్షలతో టేకు కలపతో ద్వారాలను సైతం సిద్ధం చేశారు. అలాగే గోశాల ప్రగతికి రామన్నగౌడ్ అనే భక్తుడు రూ.4 లక్షలు విరాళంగా అందజేశారు. అంతేగాక వివిధ కానుకల ద్వారా నాలుగేళ్లలో రూ.48,24,238 నగదు వచ్చింది. ఇక నిర్మాణాలన్నీ డిసెంబర్ నాటికి పూర్తి కావొచ్చాయి. త్వరలోనే అభివృద్ధి పనులు పూర్తి చేసి ఆలయ ఖ్యాతిని మరింత పెంచనున్నారు.

భక్తుల సహకారంతోనే సౌరభం

తమ విజన్‌కు ప్రభుత్వం, ఉన్నతాధికారులు అండగా నిలిచారు. భక్తులు సైతం వేలాదిగా సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఆలయ చరిత్రలోనే గుర్తుండిపోయేలా పనులు చేసేందుకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఎంతగానో ప్రోత్సహించారు. ఈరన్న స్వామి కృపతోనే పనులు శీఘ్రంగా పూర్తి చేయగలిగాం. డిసెంబర్‌లో ప్రగతి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నాం. ఆలయ పనుల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– శ్రీవాణి, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆయుష్మాన్ కార్డుల పంపిణీ

కృష్ణగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య అన్నారు. మండల పరిధిలోని టి.గోకులపాడు, తొగర్చేడు గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం ఆయుష్మాన్‌భవ హెల్త్ కార్డులను అందజేశారు. గ్రామస్తులకు 104 వాహనం నిర్వాహకులు బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ రామస్వామి, పశు వైద్యాధికారి నవీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి, బీజేపీ నాయకులు రంజిత్ కర్ని, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

10న జంగమ జనజాగృతి మహాసభ

ఆదోనిఅర్బన్: ఈనెల 10వ తేదీన పట్టణంలోని శ్రీ కోటవీరభద్ర స్వామి దేవాలయంలో జంగమ జనజాగృతి మహాసభ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, పెద్దలు ఎండీ బద్రిస్వామి, బసవరాజుస్వామి తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంతరాష్ట్రీయ కళాకారుడు మయూరి బసవరాజు(బళ్లారి), శ్రీశైలం ట్రస్టుబోర్డు సభ్యులు జంగమ విరుపాక్షయ్యస్వామి, మంత్రాలయం నుంచి జంగం సుజాతలు వస్తున్నట్లు చెప్పారు. జంగమ మహేశ్వరలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

హొళగుంద: మండల కేంద్రంతో పాటు 11 గ్రామాలకు తాగునీరు అందించేందుకు కడ్లమాగి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కట్ట కుంగడంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ నెల 6న ట్యాంక్ పడమర గట్టు దాదాపు 20 మీటర్ల మేర కుంగిపోయిన సంగతి తెలిసిందే. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే స్పందించి గట్టు మరింత దెబ్బతిని గండి పడకుండా తగిన చర్యలు చేపట్టారు. డీఈఈ మల్లికార్జున, ఏఈ రామలీల ఆధ్వర్యంలో ట్యాంక్ నిర్వహణ కాంట్రాక్ట్ పొందిన సుంకన్న కుంగిన గట్టుకు మరమ్మతు పనులు చేపట్టారు. పొక్లెన్‌తో పాటు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి గుంతను పూడ్చి పనులు చేపట్టారు. 2016 లో ఎస్ఎస్ ట్యాంక్‌కు రూ.10 కోట్లతో ట్యాంకును నిర్మించారు. ఆ సమయంలో చేపట్టిన పనుల్లో నాణ్యత కొరవడిందో ఏమో తెలియదు గానీ మూడు రోజుల క్రితం ఉన్నట్టుండి గట్టు కుంగిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో అధికారులు మరమ్మతు పనులు చేపట్టగా పనులు పూర్తయ్యేందుకు మరి కొద్ది రోజులు పట్టనుంది. ప్రస్తుతం మరమ్మతు పనులు చేపడుతున్నామని, గట్టు కుంగడానికి గల కారణాలు తెలుసుకుని శాశ్వతంగా ఉండేలా పనులు చేపడ్తామని డీఈఈ తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఎస్ఎస్ ట్యాంకులో నీటిని అలాగే నిల్వ ఉంచి మరమ్మతు పనులు కొనసాగిస్తున్నారు.

మిర్చి మార్కెట్ ప్రారంభమయ్యేనా?

- అధికారుల నిర్లక్ష్యమేనంటున్న కమీషన్ ఏజెంట్లు, అసోసియేషన్ నాయకులు
- కమీషన్ ఏజెంట్లపై నెపం నెడుతున్న సెక్రటరీ
- రెండు రోజులు యార్డు కార్యాలయం, నాలుగు రోజులు కడపలో మకాం వేస్తున్న సెక్రటరీ
- యార్డులో ఎవరికి వారే యమునా తీరుగా మారిన వైనం



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

ఆదోనిఅర్బన్: రాయలసీమలో మొట్టమొదటి మార్కెట్ యార్డుగా పేరుగాంచిన ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి మార్కెట్ లేకపోవడంతో డివిజన్ పరిధిలోని రైతులు దూర ప్రాంతాలైన గుంటూరు, కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగికి మిర్చి దిగుబడులు తీసుకెళ్తున్నారు. ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రవాణా, ఇతర ఖర్చులు పెట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ త్వరలోనే ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి మార్కెట్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌తో కూడా సంప్రదించారు. అలాగే సబ్ కలెక్టర్ యార్డు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఆదోని యార్డు సెక్రటరీ రామ్మోహన్ రెడ్డికి మిర్చి మార్కెట్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో యార్డు అధికారులు కర్ణాటక రాష్ట్రం బ్యాడిగి, గుంటూరు మార్కెట్ యార్డు మిర్చి వ్యాపారస్తులతోనూ, ఆదోని మిర్చి వ్యాపారస్తులతో సంప్రదింపులు చేసి యార్డుకు కావాల్సిన స్థలాన్ని, గోడౌన్‌లను ఏర్పాటు చేశారు.

ఆగిన ప్రారంభోత్సవం

ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈనెల 6వ తేదీన ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి మార్కెట్ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రారంభం కాలేదని కమీషన్ ఏజెంట్లు, అసోసియేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు. యార్డు అధికారి రెండు రోజులు స్థానిక కార్యాలయంలో ఉంటే నాలుగు రోజులు కడపలో ఉంటారని, దీంతో యార్డులో ఎవరికి వారే అన్నట్లు అయ్యిందని, పట్టించుకునే వారే లేరని ఆరోపిస్తున్నారు. బ్యాడిగి, గుంటూరు, ఆదోని వ్యాపారులకు ఈనెల 6వ తేదీన మిర్చి మార్కెట్ ప్రారంభించనున్నట్లు చెప్పడంతో వారు రావడానికి కూడా సిద్ధమయ్యారు. అనుకున్న ప్రకారం మిర్చి మార్కెట్‌ను ప్రారంభించకపోగా అధికారులు మిచాంగ్ తుపాన్ వల్ల ప్రారంభించలేకపోయామని చెబుతున్నారు. మార్కెట్‌ను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్‌ను పిలవాల్సి ఉంటుంది. వారిని పిలవకుండా పట్టణంలో ఉండకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల మార్కెట్ ప్రారంభానికి నోచుకోలేదని కమీషన్ ఏజెంట్లు, అసోసియేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు.

సెక్రటరీ ఎప్పుడుంటారో?

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి ఇక్కడ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెండు రోజులు యార్డు కార్యాలయంలో ఉంటే నాలుగు రోజుల పాటు కడపలో ఉంటున్నారు. ఎవరైనా సెక్రటరీ కోసం వెళ్తే మీటింగ్‌కు వెళ్లారని, ఎప్పుడొస్తారో తెలియదని యార్డు సిబ్బంది చెబుతున్నారని అసోసియేషన్ నాయకులు, కమీషన్ ఏజెంట్లు చెబుతున్నారు. యార్డులో పనికోసం వచ్చిన వారికి కూడా ఇదే సమాధానం ఎదురవుతుందని చెబుతున్నారు.

కమీషన్ ఏజెంట్లదే నిర్లక్ష్యం

యార్డులో మిర్చి మార్కెట్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. బ్యాడిగి, గుంటూరు, ఆదోని మిర్చి వ్యాపారస్తులతో చర్చించి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశాం. ప్రారంభోత్సవ తేదీని తెలియజేస్తే కమీషన్ ఏజెంట్లు, అసోసియేషన్ నాయకులు ఇప్పుడు వద్దు, అప్పుడు వద్దు అని వాయిదా వేస్తూ కాలయాపన చేస్తున్నారు. అమావాస్య పోయిన తర్వాత ప్రారంభిస్తామని అసోసియేషన్ నాయకులే తెలియజేశారు. మిర్చి మార్కెట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్‌ను ఆహ్వానించాం. కచ్చితంగా మిర్చి మార్కెట్‌ను ప్రారంభిస్తాం.

– రామ్మోహన్‌రెడ్డి, యార్డు సెక్రటరీ

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న అధికారులు

కౌతాళం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేద్దాం అని ఎంపీడీఓ సుబ్బారాజు, హౌసింగ్ డీఈ శ్రీలాలికృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి విషయంలో పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మరుగుదొడ్ల విషయంలో సమాచారం పూర్తిగా తెలుసుకుని వాటిని పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సాయి అపర్ణ, సురేంద్ర, రోనాల్డ్, సూర్యప్రకాశ్‌రెడ్డి, వీరేష్, జ్యోతిర్మాయి, నూర్‌బాషా , షేక్‌గౌస్‌అజామ్‌లు పాల్గొన్నారు.

చేత్త నిర్వహణ కేంద్రాలను పూర్తి చేయండి



బంటకుంటలో చెత్త నిర్వహణ కేంద్రం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: చేత్త నిర్వహణ కేంద్రాలను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బరాజు ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని బంటకుంట గ్రామంలో నిర్మాణం దశలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కేంద్రాలను నాణ్యతతో నిర్మించి అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట ఏపీఓ జుబేర్‌అహ్మద్, ఇంజినిరింగ్ అసిస్టెంట్ రఫీక్‌అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల భద్రతకు చర్యలు



మాట్లాడుతున్న డీఐజీ షాదీన్ జాబ్‌ఖాన్

ఆదోని సెంట్రల్: రైల్వే ప్రయాణికుల భద్రతకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు సికింద్రాబాద్ జోన్ డీఐజీ ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ షాదీన్‌జాబ్‌ఖాన్ తెలిపారు. ఆయన శుక్రవారం రాత్రి ఆదోని రైల్వే పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌కు అతి సమీపంలో నిలబడుతూ రైలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రతి రైల్వేస్టేషన్‌లో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే ప్రయాణికులను అప్రమత్తం చేయడానికి వీలవుతుందని తెలిపారు. గతంలో కన్నా క్రైమ్ రేట్ తగ్గిందని, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ని బోగీలలో ఆర్‌పీఎఫ్ పోలీసులు గస్తీ చేపడుతున్నట్లు తెలిపారు. ఆదోనిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రైల్వే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎంత మంది సిబ్బంది ఉన్నారు, ఇక్కడ సమస్యలు ఏమున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. గుంతకల్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ టి.మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బిఎస్.మిశ్రా, డిప్యూటీ ఇన్వెస్టిగేషన్ అధికారి కె.చెన్నయ్య, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జయప్రకాశ్ రెడ్డి, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలి



జేబీఎం స్కూల్‌లో విద్యార్థి పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నాగేశప్ప

కోసిగి: పాఠశాలలో విద్యార్థుల తరగతి ఆధారంగా చదువు పట్ల వారి సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ నాగేశప్ప ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం కోసిగిలోని జేబీఎం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. విద్యార్థులకు సులభతంగా అర్థమయ్యే విధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. సిలబస్ ఆధారంగా చదువులో రాణించేలా చూసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, ఉపాధ్యాయులు, సూర్యనారాయణ ప్రశాంతి ఉన్నారు.

ఆట స్థలం కేటాయించండి

కోసిగి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు ఆట స్థలం కేటాయించాలని ఆ పాఠశాల విద్యార్థినులు కోరారు. శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయంలో ఎంఈఓ నాగేశప్పను కలిసి వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 226 మంది బాలికలు చదువుతున్నారన్నారు. పాఠశాలకు తరగతి గదులు తప్పా, ఆట స్థలం లేదన్నారు. ఆటలు ఆడుకునేందుకు స్థలం కేటాయించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో శనివారం నిర్వహణ, మరమ్మతు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రౌడూరులో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కౌతాళం: మండల పరిధిలోని రౌడూరు గ్రామంలో శుక్రవారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమిరెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు అమీలియా ఆసుపత్రి వైద్యులతో పాటు బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇమ్మాన్యుయల్ ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 150 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 30 మందికి ఆపరేషన్లు అవసరం కాగా వారిని కర్నూలుకు రెఫర్ చేసినట్లు చేసినట్లు వైద్యులు తెలిపారు. మిగతా వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ 30 మందికి ఎమ్మెల్యే సహకారంతో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యుడు ఈరన్న తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాల్ని కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. స్థానిక నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి

ఆదోని సెంట్రల్: దివ్యాంగులను ప్రోత్సాహించాలే తప్ప నిరుత్సాహానికి గురి చేయవద్దని ఉప విద్యాధికారి జి.వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం భవిత కేంద్రంలో ఐఈడీఎస్ఎస్ భారతి అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగవైకల్యం ఉన్న పిల్లల్లో మనోధైర్యం నింపాలన్నారు. వారు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలన్నారు. చెవిటి, మూగ, గుడ్డి కలిగిన వారికి ప్రభుత్వం ట్యాబ్‌లను అందిస్తోందని, అందులోనే పాఠ్యంశాలను విని, చూసి నేర్చుకొనే విధంగా రూపొందించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో బోధన సామర్థ్యాలు అందులో ఉంటాయని చెప్పారు. మండల విద్యాధికారి–2 శ్రీనివాసులు మాట్లాడుతూ.. తమ పిల్లల పట్ల చిన్నచూపు చూడకుండా వారిలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన అన్ని పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకొని పిల్లల భవిష్యత్తును తీర్చుదిద్దాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను దివ్యాంగ విద్యార్థులకు అందించారు. జిల్లాలో జరిగిన ఒలంపియాడ్ గేమ్స్ పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం నిర్మలమ్మ, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు శాంతకుమార్, బి.మౌనిక, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలి



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు

ఆదోనిరూరల్: దివ్యాంగుల హక్కులు, చట్టాలను పరిరక్షించాలని సామాజికవేత్త మల్లెల గ్రూపు అధినేత డాక్టర్ ఆల్‌ఫ్రెడ్‌రాజు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదోని పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) అధ్యక్షుడు బి.సి.నాగరాజు, అమ్మ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.ఈరన్న, కార్యదర్శి కమతం వెంకటేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పింఛన్ అందించాలని, దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. దివ్యాంగుల ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడతామన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

డీఎల్‌డీఓ తనిఖీ

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈఓపీఆర్డీ బాలన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.